సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

సోమవారం | 16 | సెప్టెంబర్ | 2024



మల్బరీ సాగుకు ప్రోత్సాహం

మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ నిర్వహణ కోసం ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ప్రోత్సాహకాలు ప్రకటించింది.

- 8లో▸



కాకతీయ కాల్వకు బుంగలు

ఆసియాలోనే అతిపెద్దదైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కాకతీయ కాల్వ వల్ల ప్రమాదం పొంచి ఉంది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

31⁰/24⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఎండ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

'వాడ్రా'ను ఏర్పాటు చేయాలి




కాజీపేట అర్బన్: వరంగల్‌లోని చెరువుల పరిరక్షణ కోసం హైడ్రా మాదిరిగా ప్రభుత్వం వాడ్రాను ఏర్పాటు చేయాలని వీసీకే పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం అదాలత్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద పౌర సమాజ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రకాళి, వడ్డేపల్లి చెరువుల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాల్ని తొలగించాలని డిమాండ్ చేశారు. కబ్జాదారుల నుంచి వరంగల్ నగరాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, కొంద్ర శంకర్, శేషు, సాయిని నరేందర్, చింతం ప్రవీణ్, ఎర్రగట్టు స్వామి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేయూకు నేడు సెలవు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి వర్సిటీ పరిధిలోని కాలేజీలకు ఈనెల 16న సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిలాద్ ఉన్ నబీ నేపథ్యంలో.. ఈనెల 16న సెలవును ప్రకటించినట్లు మల్లారెడ్డి తెలిపారు. ఈనెల 17న యథావిధిగా యూనివర్సిటీకి వర్సిటీ పరిధి కాలేజీలకు పని దినంగానే పరిగణించాలని పేర్కొన్నారు.

రుద్రేశ్వరాలయంలో మహా పూర్ణాహుతి



హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరాలయంలో జరుగుతున్న ఉత్తిష్ట గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం గణపతి హవనం, మహా పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. మూల మహాగణపతిని శ్రీసిద్ధి బుద్ధి గణపతిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేద పండితులు మణికంఠ శర్మ, అర్చకులు సందీప్‌శర్మ, ప్రణవ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాల వితరణ జరిగింది. గత తొమ్మిదిరోజులుగా దేవాలయంలో నిర్వహించిన పేరిణి, కూచిపూడి, భరతనాట్యం సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభకనబర్చిన చిన్నారులకు ఆర్యవైశ్య జాతీయ నాయకులు గట్టు మహేశ్‌బాబు ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. సోమవారం కలశ ఉద్వాసన, ఉత్సవ విగ్రహ ఉద్వాసన, సాయంత్రం మహా శోభాయాత్ర ప్రారంభమవుతుందని స్వామివారి నిమజ్జనోత్సవంతో ఉత్సవాల సమాప్తి జరుగుతుందని గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం



విద్యారణ్యపురి: పీఆర్టీయూ టీఎస్ హనుమకొండ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆదివారం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మందల తిరుపతిరెడ్డి, జనరల్ సెక్రటరీగా ఫలిత శ్రీహరి, అసోసియేట్ అధ్యక్షులుగా డి.కోమల్‌రెడ్డి, కె.దయాకర్‌రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా వి.వాణి, ఉపాధ్యక్షులుగా ఎ.మహిపాల్‌రెడ్డి, వి.రామాంజనేయులు, కె.రాజేందర్‌రెడ్డి, జి.విష్ణుమూర్తి, ఎం.సురేందర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా పి.సరస్వతి, కార్యదర్శులుగా బి.మురళీధర్, బి.శరత్ గౌడ్, ఎల్.గణపతినాయక్, కె.రమేశ్‌బాబు, జి.రాజయ్య, మహిళా కార్యదర్శిగా నికల్ సుల్తానా ఎన్నికయ్యారు.

ఘనంగా సన్మానం

పీఆర్టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీలుగా ఎన్నికైన మందల తిరుపతిరెడ్డి, ఫలిత శ్రీహరిని 14 మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు ఇతర బాధ్యులు ఘనంగా సన్మానించారు. కాజీపేట మండల అధ్యక్షుడు దేవిరెడ్డి మాలకొండారెడ్డి, వేలేరు మండల అధ్యక్షుడు బాను ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



వరంగల్ ఉర్సు చెరువు వద్ద నిమజ్జనం కోసం తెచ్చిన భారీ తెప్పలు

నిమజ్జనానికి వేళాయె..



హనుమకొండ సిద్ధేశ్వర ఆలయ గుండంలో వినాయక నిమజ్జనానికి చేసిన ఏర్పాట్లు

నేడు గణేశ్ నిమజ్జనం

- 10 కేంద్రాల్లో విస్తృత ఏర్పాట్లు
- 22 క్రేన్లు, 1,200 మంది గజ ఈతగాళ్లు
- ప్రధాన కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- విద్యుత్ దీపాలు, బారికేడ్ల ఏర్పాట్లు
- పర్యవేక్షించిన కలెక్టర్, అధికారులు

వరంగల్ అర్బన్: తొమ్మిది రోజులు విశేష పూజలందుకున్న గణనాథుల నిమజ్జనానికి సర్వం సిద్ధమైంది. వరంగల్ మహానగర వ్యాప్తంగా సోమవారం (నేడు) నిర్వహించే నిమజ్జనానికి చిన్నవడ్డేపల్లి చెరువు, ఉర్సు రంగసముద్రం, గొర్రెకుంట కట్ట మల్లన్న, ఖిలా వరంగల్ అగర్తల, మామునూరు బెస్తం చెరువు , హనుకొండ, కాజీపేటలోని సిద్ధేశ్వర గుండం, బంధం చెరువు, హసన్‌పర్తి పెద్ద చెరువు, భీమారం, మడికొండ చల్ల చెరువు, కడిపికొండ, మడికొండ, సోమిడి, ఎల్లాపూర్, గుండ్లసింగారం, రాంపేట,రాంపూర్,సింగారం,చల్ల చెరువు వద్ద వివిధ శాఖల అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. బల్దియాతోపాటు వివిధ శాఖల ద్వారా రూ.3కోట్ల నిధులు వెచ్చిస్తున్నారు. నగర మేయర్, కలెక్టర్లు, పోలీస్, నగర కమిషనర్ దిశానిర్దేశం మేరకు ఆదివారం సాయంత్రం వరకు పనులన్నీ పూర్తి చేశారు. నగరంలో గతేడాది 5,965 విగ్రహా లను నిమజ్జనం చేయగా.. ఈ ఏడాది 6,500ల పైచిలుకు ఉంటాయని అధికారులు అంచనా వేశారు.

ప్రభుత్వ శాఖల వారీగా పనులిలా..

బల్దియా ఆధ్వర్యాన రోడ్ల మరమ్మతులు, తాగునీటి సరఫరా, లైటింగ్, పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఐదు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా శోభాయాత్రలు, నిమజ్జన ప్రక్రియను పోలీసులు నిరంతరం పర్యవేక్షించనున్నారు. చెరువుల వద్ద బారికేడ్లు, 30కి పైగా తెప్పలు, 22 క్రేన్లు, టెంట్లు, కుర్చీలు, 1,200 మంది గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. 108 అంబులెన్స్‌లు, తాత్కాలిక ఉచిత వైద్య శిబిరాలు, బందోబస్తు తదితర ఏర్పాట్లలో ఆయా శాఖలు అధికారులు నిమగ్నమయ్యారు.

ఎక్కడ ఎలా అంటే..

- **చిన్నవడ్డేపల్లి చెరువు :** నగరంలోని అన్నీ చెరువుల కంటే వరంగల్ చిన్నవడ్డేపల్లి చెరువులో ఎక్కువ మొత్తంలో వినాయకులను నిమజ్జనం చేయనున్నారు. ఇక్కడ గత ఏడాది 3,630 విగ్రహాలు నిమజ్జం చేయగా.. ఈసారి 4వేలకు పైచిలుక ఉంటాయని అంచనా వేసి 4 భారీ క్రేన్లు, 4 తెప్పలను సిద్ధం చేశారు. 36 గంటల పాటు ఇక్కడ నిరంతరాయంగా నిమజ్జనాలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.
- **ఉర్సు రంగసముద్రం :** ఈ చెరువులో గత ఏడాది 600 విగ్రహాలు నిమజ్జనం కాగా ఏడాది 800 వాస్తాయని అంచనా. శివనగర్, ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోట తదితర ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాల కోసం 3 పెద్ద క్రేన్లు ఏర్పాటు చేశారు.
- **కట్టమల్లన్న చెరువు :** ఇక్కడ 2 క్రేన్లను అందుబాటులో ఉంచారు. గత ఏడాది 135 విగ్రహాలు నిమజ్జనం ఏయగా.. ఈ ఏడాది విలీన గ్రామం గొర్రెకుంట, లేబర్‌కాలనీ, చింతల్, జానీపీరీలు, కీర్తినగర్ కాలనీల నుంచి 200 వరకు వస్తాయని భావిస్తున్నారు.
- **హనుమకొండ సిద్ధేశ్వరగుండం :** ఇక్కడ గత ఏడాది 400 విగ్రహాలను నిమజ్జనం చేయగా.. ఈసారి 450 వరకు రావొచ్చని అందుకు తగినట్లుగా 3 పెద్ద క్రేన్లు, రెండు తెప్పలు సిద్ధం చేశారు. హనుమకొండలోని పలు కాలనీల నుంచి ప్రతిమలను ఇక్కడ నిమజ్జనం చేయనున్నారు.
- **కాజీపేట బంధం చెరువు :** ఇక్కడ 4 క్రేన్లు, మూడు తెప్పలను అందుబాటులో ఉంచారు. గతేడాది 430 ప్రతిమలను నిమజ్జనం చేయగా.. ప్రస్తుతం 450 వరకు వస్తాయని అంచనా వేశారు. ఇక్కడ గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. హనుమకొండలోని పలు ప్రాంతాలు, కాజీపేటలోని విగ్రహాలను ఇక్కడికి తరలిస్తారు.
- **హసన్‌పర్తి పెద్ద చెరువు :** ఇక్కడ 2 క్రేన్లు, 2 తెప్పలు ఏర్పాటు చేశారు. 200 వరకు విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. అలాగే మామునూరు బెస్తం చెరువు, ఖిలా వరంగల్ అగర్తల, భీమారం చమాల చెరువు, మడికొండ చల్ల చెరువుల వద్ద ఒక్కో క్రేన్, తెప్పలతోపాటు గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు.

నేడు ట్రైసిటీలో ట్రాఫిక్ ఆంక్షలు

- వివరాలు 8లో▸

కోట చెరువులో నిమజ్జనం నిషేధం



ఉర్సు చెరువు వద్ద ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్, కమిషనర్

వరంగల్ అర్బన్: వరంగల్ నగరంలోని చిన్నవడ్డేపల్లి, బెస్తం, ఉర్సు రంగసముద్రం, అగర్తల చెరువుల వద్ద చేపట్టిన గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్ సత్యశారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి,అధికారులు ఆదివారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కోట చెరువులో నిమజ్జనం నిషేధించామని, ఇక్కడికి బదులు దేశాయిపేటలోని చిన్నవడ్డేపల్లి చెరువులో నిమజ్జనానికి అదనంగా క్రేన్లు ఏర్పాట్లు చేశామని, ఉత్సవ కమిటీలు, భక్తులు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. చెరువులు, కాలువల్లో భారీగా నీరు ఉన్నందున డీఆర్ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. సోమవారం మధ్యాహ్నం నుంచి నిమజ్జనం ప్రారంభం కానుందని, కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా ఉత్సవ కమిటీ సభ్యులు, గణేశ్ మండపాల నిర్వాహకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వారి వెంట ఆర్డీఓ కృష్ణవేణి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఉత్తమ గణపతులకు బహుమతులు



ప్రథమ బహుమతి అందుకున్న శ్రీశ్రీశ్రీగజానన మండలి సభ్యులతో నిర్వాహకులు, ముఖ్య అతిథి

హన్మకొండ కల్చరల్: వరంగల్ మహానగర్ గణపతి నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉత్తమ గణపతి మండపాలకు బహుమతుల ప్రదానం ఆదివారం రాత్రి హనుమకొండ టీటీడీలో జరిగింది. హనుమకొండ టీఎన్జీఓస్ కాలనీ ఫేస్ టు 100 ఫీట్లరోడ్ శ్రీశ్రీశ్రీ గజానన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతికి ప్రథమ, కాజీపేట బాపూజీనగర్ హమారా హిందుస్తాన్ విఘ్నేశ్వరుడికి ద్వితీయ, హనుమకొండ నందిహిల్స్ వరసిద్ధి వినాయక మండలి వినాయకుడికి ప్రత్యేక బహుమతి లభించింది. ముఖ్య అతిథిగా హాజరైన సిద్ధయోగి స్వామి శ్రీశ్రీ చైతన్య ఆనంద మహారాజ్ బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయకుడు ఆధ్యాత్మిక, సామాజిక, ఆరోగ్య, విజ్ఞానాత్మక అంశాల సమాహారమని పేర్కొన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ఉత్సవ సమితి కన్వీనర్ న్యాలకొండ భాస్కరరావు, కోకన్వీనర్ శ్రీరామ్‌ఉదయ్ కుమార్, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు కేసిరెడ్డి జయపాల్‌రెడ్డి, వెలగందుల రాజు పాల్గొన్నారు.

మతాలను గౌరవిస్తూ పండుగలు జరుపుకోవాలి

- సీపీ అంబర్ కిషోర్ ఝా



మాట్లాడుతున్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: అన్ని మతాలను గౌరవిస్తూ.. సంతోషాల నడుమ పండుగలను జరుపుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ట్రైసిటీకి చెందిన ముస్లిం మత పెద్దలు, శాంతి కమిటీతో సమావేశం జరిగింది. ఈనెల 16న మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు నిర్వహించాల్సి ఉండగా.. అదే రోజు గణేశ్ నిమజ్జనం ఉన్నందున ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముస్లిం మత పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి ఈనెల 19న మిలాద్ ఉన్ నబీ ఉత్సవాల్ని నిర్వహించేందుకు ముస్లిం మత పెద్దలంతా అంగీకరించినట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతీ మతం వారు క్రమశిక్షణతో వ్యవహరిస్తూ వారి పండుగలకు సంబంధించి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడం వరంగల్ నగరవాసుల ప్రత్యేకత అని అన్నారు. మత సామరస్యంలో వరంగల్ ఇతర ప్రాంతాల వారికి ఆదర్శంగా నిలుస్తోందని.. ఇదే సంప్రదాయాన్ని భావితరాలవారికి అందజేయాలని ఆయన సూచించారు. కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగ వేళ మత సామరస్యంలో భాగంగా ఎంతోమంది ముస్లిం యువకులు గణేశ్ విగ్రహాలను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేశారని పేర్కొన్నారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా నిమజ్జనం కోసం తరలివెళ్లే భక్తులకు మార్గమధ్యలో మంచినీరు, మజ్జిగను అందించడం జరుగుతుందని ఖుస్రూ పాషా తెలిపారు. సమావేశంలో వెస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, నందిరాంనాయక్, దేవేందర్‌రెడ్డి, కిషోర్, తిరుపతి, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

డీడబ్ల్యూఓగా రాజమణి



వరంగల్: జిల్లా సంక్షేమ విభాగాధికారి (డీడబ్ల్యూఓ)గా బి.రాజమణి నియమితులయ్యారు. నాలుగు నెలలుగా ఇక్కడ పనిచేస్తున్న జె.హైమావతిని మెదక్ జిల్లాకు బదిలీ చేస్తూ రాష్ట్ర మహిళా సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హనుమకొండ డీడబ్ల్యూఓ (పూర్తి అదనపు బాధ్యతలు)గా పనిచేస్తున్న రాజమణికి పదోన్నతి కల్పించి వరంగల్ డీడబ్ల్యూఓగా పోస్టింగ్ ఇచ్చారు.

వరి వైపే మొగ్గు

- సాగులో ద్వితీయ స్థానం పత్తిది



హన్మకొండ: రైతులు వరి సాగువైపు మొగ్గు చూపారు. దీంతో హనుమకొండ జిల్లాలో సాగులో వరి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత అత్యధికంగా సాగు చేసింది పత్తి. మూడో స్థానంలో మొక్కజొన్న నిలిచింది. మిగతా పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. అపరాల సాగు, నూనె గింజల సాగు నామ మాత్రంగా ఉంది. అపరాలు, నూనె గింజల సాగువైపు రైతులు దృష్టి సారించడం లేదు. ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభించడం లేదు. అపరాలు, నూనె గింజలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పంటల సాగు ఆశించిన మేరకు జరగడం లేదు. హనుమకొండ జిల్లాలో ఈవానాకాలంలో అన్ని పంటలు కలిపి 2,40,220 ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గత వానా కాలంలో 2,33,281 ఎకరాల్లో సాగు చేశారు. ఈవానా కాలంలో ఇప్పటి వరకు అన్ని పంటలు కలిపి 2,25,769 ఎకరాల్లో సాగైంది. గతేడాది వానాకాలంతో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముందని అధికారులు నిర్ధారణకు వచ్చారు.

తగ్గిన సాగు విస్తీర్ణం..

వానాకాలం సీజన్ ఆరంభంలో సమయానికి వర్షాలు పడలేదు. విత్తనాలు వేయగానే వర్షం ముఖం చాటేయడంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఈసారి మందకొడిగానే సాగుతోంది. సమయానుకూలంగా వర్షాలు కురవకపోవడంతో ప్రతికూల పరిస్థితులు నెలకొని సాగుకు ప్రతిబంధకంగా మారింది. గత వానాకాలంతో చూసుకుంటే ఈ వానాకాలంలో వరి, పత్తి సాగు విస్తీర్ణం తగ్గింది. వరి గతేడాది 1,45,943 ఎకరాల్లో సాగు చేయగా.. ఈవానాకాలంలో 1,48,400 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 1,42,300 ఎకరాల్లో సాగైంది. పత్తి గతేడాది 82,277 ఎకరాల్లో సాగు చేయగా.. ఈవానాకాలంలో 85 వేల ఎకరాల్లో సాగవనుందని అంచనా వేశారు. ఈసారి 76,154 ఎకరాల్లో సాగైంది. గత వానాకాలంతో పోలిస్తే 6,123 ఎకరాల్లో పత్తి సాగు తగ్గింది. అంచనా ప్రకారం చూస్తే.. 8,846 ఎకరాల విస్తీర్ణం తగ్గింది. మొక్కజొన్న గతేడాది 4,187 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ వానాకాలంలో 5,820 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా.. 6,212 ఎకరాల్లో సాగైంది. ఈసారి మొక్కజొన్న సాగు స్వల్పంగా పెరిగింది. నూనె గింజలు గతేడాది 265 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ వానాకాలంలో 300 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. 64 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. పప్పు దినుసులు గతేడాది 180 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ వానాకాలంలో 608 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా 1,039 ఎకరాల్లో సాగైంది.

అమృత్ అస్తవ్యస్తం

నిర్వహణను పట్టించుకోని బల్దియా

- పనులు పర్యవేక్షించని ఇంజనీర్లు
- పాత పైపులైన్లకు తూట్లు.. అరకొర మరమ్మతులు
- లీకేజీలతో నగరవాసులకు ఇబ్బందులు



కాశిబుగ్గ ఓసిటీ జంక్షన్‌లో లీకేజీ కారణంగా పాడైపోయిన రోడ్డు



లీకేజీలు అరికట్టకుండానే తిలక్‌రోడ్డుపై వేసిన సీసీ



పోచమ్మమైదాన్ జంక్షన్ సమీపంలో ధ్వంసమైన రోడ్డుపై నీటి ప్రవాహం

వరంగల్: నగరంలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అమృత్ పథకం కింద చేపట్టిన పనులు అస్తవ్యస్తంగా మారాయి. రెండు విభాగాల మధ్య సమన్వయ లోపం కారణంగా తరచూ నీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. దీనికితోడు పలు కంపెనీలు ఇంటర్‌నెట్ కేబుల్ వేయడానికి రోడ్లపై డ్రిల్లింగ్ చేస్తున్న సమయంలో పైపులైన్లు దెబ్బతింటున్నాయి. పర్యవేక్షించాల్సిన బల్దియా ఇంజనీర్లు పట్టించుకోకపోవడంతో నగర వాసులకు ఇబ్బందులు తప్పడంలేదు. నగరంలోని తాగునీటి సరఫరా కోసం సుమారు 40 ఏళ్ల క్రితం ఫిల్టర్‌బెడ్ల నుంచి ఓవర్ హెడ్ ట్యాంకు వరకు అధిక వ్యాసార్థం ఉన్న పైపులైన్లు వేశారు. అవి ఏదిశలో ఉన్నాయి.. ఎంత లోతున ఉన్నాయన్న విషయాలపై ఇప్పటి ఇంజనీర్లకు అవగాహన లేదు. 2008లో కేంద్రం నిధులు రూ.180 కోట్ల వ్యయంతో కొత్త ఓవర్ హెడ్ ట్యాంకులు, ప్రధాన పైపులైన్లు, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు వేశారు. పాత వాటితోపాటు వీటికి సంబంధించిన ప్లాన్‌పై ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న ఇంజనీరింగ్ అధికారులకు పూర్తి సమాచారం లేదని తెలిసింది. వీటికి తోడుగా కేంద్రం అమృత్ పథకంలో సుమారు రూ.600 కోట్ల వ్యయంతో గ్రేటర్ పరిధి అన్ని ఆవాస ప్రాంతాలకు నీటి సరఫరా కోసం మరోసారి పెద్ద మొత్తంలో ట్యాంకులు, ప్రధాన పైపులైన్లు, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లను పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ చేపట్టింది. బల్దియా ఇంజనీర్లకు సమాచారం ఇవ్వకుండానే ఇష్టారీతిన పనులు చేపట్టారు. పూర్తయ్యాక నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని పలుమార్లు బల్దియా ఇంజనీర్లకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోలేదు. ఎందుకంటే చేసిన పనులు అస్తవ్యస్తంగా ఉండడం, ప్రణాళికాబద్ధంగా లేకపోవడమే కారణమని తెలుస్తోంది. అమృత్ పథకం కింద చేపట్టిన పనులు మొత్తం పూర్తిచేస్తే తప్ప నిర్వహణ బాధ్యత చేపట్టేది లేదని బల్దియా ఇంజనీర్లు చెప్పారు. దీంతో నీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి.

రోడ్లపై డ్రిల్లింగ్.. పైపులైన్లకు తూట్లు..

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ కోసం పలు కంపెనీలు కేబుల్ వేయడానికి రోడ్లపై డ్రిల్లింగ్ చేస్తున్నాయి. ఈ పనులు చేపట్టే సమయంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పర్యవేక్షించాలి. అలాంటిదేమీ జరగడంలేదు. దీంతో పలు ప్రాంతాల్లో నీటి సరఫరా పైపులైన్లు ధ్వంసం అవుతున్నట్లు తెలుస్తోంది. వరంగల్ పోచమ్మమైదాన్ కూడలితోపాటు దేశాయిపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై పాత పైపులైన్లు దెబ్బతిని నిత్యం నీరు ప్రవహిస్తోంది. రెండు నెలల క్రితం ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడడంతో నీరు రహదారిపై ప్రవహించి పెద్ద గొయ్యి ఏర్పడింది. అప్పటికప్పుడు ఇంజనీర్లు తాత్కాలిక మరమ్మతులు చేసి గుంతను పూడ్చినా నిత్యం నీరు ప్రవహిస్తూనే ఉంది. అలాగే.. పది రోజుల క్రితం కాశిబుగ్గ ఓసిటీకి వెళ్లే జంక్షన్‌లో ఓ ప్రైవేట్ కంపెనీ అండర్ గ్రౌండ్‌లో కేబుల్ వేసేందుకు డ్రిల్లింగ్ చేయగా 40 ఏళ్ల నాటి పైపులైన్ ధ్వంసమైంది. దీంతో రెండుమూడు రోజులు నీటి సరఫరా నిలిచిపోయింది. యుద్ధప్రాతిపదికన లీకేజీని అరికట్టిన కాంట్రాక్టర్ మట్టి పోసి వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, పలు ప్రాంతాల్లో పైపులైన్ల లీకేజీలను అరికట్టకుండానే రోడ్ల మధ్యలో ఉన్న గుంతలను సిమెంట్‌తో పూడ్చివేశారు.

పనులు పూర్తయితే తీసుకుంటాం..

> అమృత్ పథకంలో పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ చేపట్టిన పనులు చివరి దశలో ఉన్నాయి. ఓవర్‌హెడ్ ట్యాంకుల వద్ద ప్రహరీలు నిర్మించాల్సి ఉంది. కొన్ని కాలనీల్లో పైపులైన్లు వేసినప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయి. వీటన్నింటినీ పూర్తి చేశాకే నిర్వహణ బాధ్యతలు చేపడతాం.
>
> – రాజయ్య, బల్దియా ఇన్‌చార్జ్ ఎస్ఈ

ముగిసిన జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు



విజేత క్రీడాకారులతో ఏసీపీ తదితరులు

హసన్‌పర్తి: కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి టెబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన విజేతలకు మెమొంటోలు అందజేశారు. టెబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆకారపు హరీశ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిలి రమేశ్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌ట డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే :

పురుషులు (సింగిల్స్): అభినవ్, వరంగల్ క్లబ్ (విన్నర్), యష్, నిట్(రన్నర్).

మహిళలు (సింగిల్స్): తనూశ్రీ, వరంగల్ క్లబ్ (విన్నర్), ఎం.వర్షిత, కిట్స్ (రన్నర్).

పురుషులు (డబుల్స్): అజయ్‌కుమార్, ఎ.సురేశ్ (విన్నర్), డి.దేవేందర్, ఎ.రాజేశ్ (రన్నర్).

మహిళలు (డబుల్స్): పి.శార్వాణి, జి.సరయ (విన్నర్), బి. ప్రణతి, లక్ష్మి (రన్నర్).

మిక్సింగ్ డబుల్స్: తనూశ్రీ, కె.అభినవ్ (విన్నర్), వర్షిత, పి.భరత్‌కుమార్ (రన్నర్).

గణనాథుడికి 101 కిలోల లడ్డూ



వరంగల్ కాశిబుగ్గ ప్రతాపరుద్ర వీధిలో 101 కిలోల భారీ లడ్డూతో మహిళా భక్తులు

కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గ ప్రతాప రుద్ర వీధిలో యువ గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి 101 కిలోల భారీ లడ్డూను సమర్పించారు. ఆదివారం డప్పుచప్పుళ్లు, మహిళల కోలాటాలతో మదన్‌లాల్ స్వీట్ హౌస్ నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి వినాయకుడికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

రేపు వరంగల్ మార్కెట్ పునఃప్రారంభం

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ 17వ తేదీన (మంగళవారం) పునః ప్రారంభమవుతుందని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ (శనివారం), 15వ తేదీ (ఆదివారం), 16వ తేదీన, (సోమవారం, వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా) ప్రభుత్వం సెలవు ప్రకటించిందన్నారు. 17వ తేదీన (రేపు) మార్కెట్ పునః ప్రారంభమవుతుందన్నారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు, గుమస్తాలు గమనించాలని కోరారు.

ఇద్దరిపై కేసు నమోదు

శాయంపేట : ఎస్సీ, ఎస్టీ కమిషన్ కమిషన్ ఆదేశాల మేరకు ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన దైనంపల్లి మల్లికార్జున్ 2021లో అదే గ్రామానికి చెందిన రైతు వంగ కొమురయ్య వద్ద 22 గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. 2021 జనవరి 22న హద్దులు కూడా నాటించి ఇచ్చాడు. అదే రోజు అదే గ్రామానికి చెందిన పక్క రైతులైన చల్లా సాంబరెడ్డి, చల్లా భాస్కర్ రెడ్డి.. ఇక్కడ నీకు భూమి ఎక్కడిది రెడ్డి వాళ్ల మధ్యలో భూములు కొంటావా.. అని కులం పేరుతో దూషించి కొమురయ్య నాటిన హద్దులను తొలగించారు. ఈ ఘటనపై బాధితుడు మల్లికార్జున్ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను సంప్రదించాడు. కమిషన్ ఆదేశాల మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

జ్వరంతో వస్తే వెళ్లగొట్టారు..

- వైద్య సిబ్బందిపై కుటుంబ సభ్యుల ఆగ్రహం



వివరాలు తెలుపుతున్న బాధితులు

స్టేషన్‌ఘన్‌పూర్: తీవ్ర జ్వరంతో ఉన్న బాలికను ప్రభుత్వాపత్రికి తీసుకువస్తే వైద్య సిబ్బంది వెళ్లగొట్టిన ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగింది. బాధిత బాలిక తండ్రి ఇల్లందుల కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాఘవాపూర్‌కు చెందిన ఇల్లందుల కుమార్ అతడి కుమార్తె కృషిప్రభకు తీవ్ర జ్వరంగా ఉంటే ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇప్పుడు చూసేది లేదంటూ గేటు నుంచే సెక్యూరిటీ వారు, వైద్య సిబ్బంది వెళ్లగొట్టారు. చేసేదే లేక వెళ్లిపోయి ఉదయం 10 గంటల తర్వాత వచ్చారు. డ్యూటీ డాక్టర్ సౌఖ్య బాలికను పరిశీలించి ఆదివారం సెలవు కావడంతో ఆస్పత్రిలో ల్యాబ్ బంద్ ఉందని, రక్త పరీక్షలు చేయించుకుని వస్తే వైద్యం చేస్తానని చెప్పింది. అమ్మాయి నీరసంగా ఉంది.. ముందు అడ్మిట్ చేసుకోమని కోరగా రక్త పరీక్ష రిపోర్టు వచ్చాకే అడ్మిట్ చేసుకుంటామనడంతో బాలిక కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది కల్పించుకోవడంతో వాదనలు జరిగాయి. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ రాజమౌళి, పోలీసు సిబ్బంది చేరుకుని డాక్టర్‌కు, రోగి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. అనంతరం బాలికను ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకోగా.. ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్ వచ్చి రక్తనమూనా తీసుకెళ్లాడు. ఈ విషయమై డాక్టర్ సౌఖ్యను వివరణ కోరగా.. 'జ్వరంతో రోగి రాత్రి 2 గంటలకు వచ్చిన విషయం నాకు తెలియదు.. రాత్రి డ్యూటీ డాక్టర్‌గా ఆస్పత్రిలో ఉన్నా. వారు గేటు వద్ద నుంచే వెళ్లినట్లు తెలిసింది. ఉదయం వస్తే జ్వరం చూసి మందులు రాసిచ్చా. ఎలాంటి జ్వరమో తెలుసుకునేందుకు రక్త పరీక్షలు చేయించమని చెప్పా. రిపోర్టుల ద్వారా సరైన వైద్యం చేసే అవకాశం ఉంటుంది. నిబంధనల మేరకు పనిచేస్తున్నాం' అని ఆమె పేర్కొన్నారు.



మల్బరీ సాగుకు ప్రోత్సాహం

- సాగు చేసే రైతుల కోసం 'సిల్క్ సమగ్ర పథకం'
- పట్టు పరిశ్రమ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం



మల్బరీ తోట



సిద్ధమైన పట్టు గూళ్లు

డోర్నకల్: మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ నిర్వహణ కోసం ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ప్రోత్సాహకాలు ప్రకటించింది. రెండేళ్ల క్రితం పట్టుగూళ్ల ధర కిలో రూ.400 ఉండగా గతేడాది రూ.600కు పెరిగింది. ప్రస్తుతం పట్టుగూళ్లకు మరింత డిమాండ్ పెరిగింది. తద్వారా జనగామ, హైదరాబాద్ మార్కెట్‌లో పట్టుగూళ్లకు భారీ డిమాండ్ ఉంది. పట్టుగూళ్ల ద్వారా అధిక ఆదాయం ఇచ్చే మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ ఏర్పాటును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిల్క్ సమగ్ర పథకాన్ని అమలు చేస్తోంది. ఇతర వాణిజ్య పంటల కన్నా మల్బరీ, పట్టు పరిశ్రమ నిర్వహణతో అధిక లాభాలు వస్తున్నాయి. దీంతో మల్బరీ, పట్టు పరిశ్రమ నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమానికి పట్టు పరిశ్రమ శాఖ శ్రీకారం చుట్టింది. సిల్క్ సమగ్ర పథకం కింద అమలు చేసే ఈ పథకానికి ఎస్సీ, ఎస్టీ, జనరల్ రైతులకు రాయితీలను వేర్వేరుగా ప్రకటించింది.

సిల్క్ సమగ్ర పథకం ద్వారా రైతులకు రాయితీలు

వివరాలు	జనరల్	ఎస్సీ/ఎస్టీ
రెండు ఎకరాల్లో మల్బరీ సాగు	రూ.60,000	రూ.78,000
నీటి సదుపాయానికి	రూ.50,000	రూ.65,000
పట్టు రేరింగ్ షెడ్ నిర్మాణం	రూ.2,25,000	రూ.2,95,000
పరికరాలకు	రూ.37,500	రూ.48,750
రోగ నిరోధక మందులకు	రూ.2,500	రూ.3,250
కిసాన్ నర్సరీ (యూనిట్‌కు రూ.1.5లక్షలు)	రూ.75,000	రూ.97,500

మల్బరీ సాగుకు సానుకూల అంశాలు

అతి తక్కువ నీటి వినియోగం అవసరం కాగా మొక్కలను ఒకసారి నాటితే 10నుంచి 15ఏళ్ల వరకు దిగుబడినిస్తాయి. నల్లరేగడి, చౌడు మినహా అన్నిరకాల నేలలు మల్బరీ సాగుకు అనుకూలం. క్రిమిసంహారక మందుల అవసరం ఉండదు. మొదటి సంవత్సరం 3 పంటలు, రెండో సంవత్సరం నుంచి 6 నుంచి 7 పంటల దిగుబడి ఉంటుంది.

ప్రభుత్వం నుంచి రాయితీలు



పట్టు పరిశ్రమను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చే రైతుల కోసం ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. పట్టు పరిశ్రమ ద్వారా వాణిజ్య పంటల కంటే అధిక ఆదాయం పొందొచ్చు. మల్బరీసాగు అన్ని విధాలా అనుకూలంగా ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు సంబంధిత జిల్లాల పట్టుపరిశ్రమ అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

– జి.అనసూయ, సంయుక్త సంచాలకురాలు, పట్టుపరిశ్రమశాఖ, హనుమకొండ

కాకతీయ కాల్వకు బుంగలు

- టెక్స్‌టైల్ పార్కుకు పొంచి ఉన్న ప్రమాదం
- తెగిపోతే కైటెక్స్ పరిశ్రమకు భారీ నష్టం..!

సంగెం: ఆసియాలోనే అతిపెద్దదైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కాకతీయ కాల్వ వల్ల ప్రమాదం పొంచి ఉంది. అధికారుల నిర్లక్ష్యంతో కోట్లాది రూపాయల ఆస్తినష్టం, ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంగెం–గీసుకొండ మండలాల పరిధిలో ఏర్పాటవుతున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో కంపెనీల నిర్మాణం శరవేగంగా కొనసాగుతున్నది. ఎస్సారెస్పీ నుంచి మహబూబాబాద్ జిల్లాకు నీరందించే ప్రధాన కాకతీయ కెనాల్‌కు సంగెం మండలంలోని వెంకటాపూర్–కుంటపల్లి గ్రామాల మధ్య బుంగలు పడ్డాయి. అనేక చోట్ల రెయిలింగ్ దెబ్బతిన్నది. భారీగా బుంగలు పడిన ప్రాంతంలో కాల్వ కిందివైపున రెండు వందల మీటర్ల దూరంలో అతిపెద్ద వస్త్ర పరిశ్రమ కైటెక్స్ నిర్మాణం జరుగుతున్నది. భారీగా నీరు వదిలితే బుంగలు పడినచోట కోతకు గురై కాల్వకు గండిపడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మొదట కైటెక్స్, గణేశ్, యంగ్‌వన్ తదితర కంపెనీల్లోని ఖరీదైన యంత్రాలు దెబ్బతింటాయి. అదేవిధంగా వరదతో రోడ్లు దెబ్బతినడంతోపాటు వరంగల్–విజయవాడ రైల్వే లైన్ దెబ్బతినే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కాల్వకు బుంగలు పడ్డాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న కాల్వ రెయిలింగ్‌తోపాటు బుంగలను పూడ్చి వేసి ప్రమాదాలు జరుగకుండా అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.



రెయిలింగ్ దెబ్బతిన్న కాకతీయ ప్రధాన కాల్వ

నేడు కాజీపేటలో 'వందేభారత్' ప్రారంభం

- పాల్గొననున్న ఎంపీలు, మంత్రులు, అధికారులు



వందేభారత్ ఎక్స్‌ప్రెస్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో సోమవారం రాత్రి నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య ప్రయాణించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. నాగ్‌పూర్ –సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌లో ప్రారంభిస్తుండగా కాజీపేట జంక్షన్‌లో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీలు, మంత్రులు, రైల్వే అధికారులు పాల్గొంటారని తెలిపారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ వివరాలు..

నాగ్‌పూర్–సికింద్రాబాద్ (20101) ఎక్స్‌ప్రెస్ ఆదివారం నాగ్‌పూర్‌లో సాయంత్రం 16.15 గంటలకు బయలుదేరి సేవాగ్రామ్‌కు 17.00 గంటలకు, చంద్రాపూర్‌కు 18.20 గంటలకు, బల్హర్షాకు 18.40 గంటలకు, రామగుండానికి 20.20 గంటలకు, కాజీపేట జంక్షన్‌కు రాత్రి 21.25 గంటలకు చేరుకుని సికింద్రాబాద్‌కు 23.25 గంటలకు చేరుతుంది.

రైలు హైలెట్స్

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 20 కోచ్‌లు ఉంటాయి. వీటిలో 2 ఎగ్జిక్యూటివ్ క్లాసెస్ కోచ్‌లు, 18 చైర్ కార్ కోచ్‌లు పుల్లీ ఏయిర్ కండిషన్డ్ విత్ కంబైన్డ్ సిట్టింగ్ కెపాసిటీ ఆఫ్ 1440 సీట్లు ఉన్నాయి. నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య 7 గంటల 15 నిమిషాల ప్రయాణ దూరం. గంటకు 160 కి.మీ.వేగంతో ప్రయాణం. వైఫై సమాచారం. జీపీఎస్ బేస్డ్ ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్. టచ్ బయో వాక్యూమ్ టాయ్‌లెట్స్, ఎల్ఈడీ లైటింగ్, చార్జింగ్ పాయింట్స్ సీట్స్, ఇండివిజల్ టచ్ బేస్డ్ రీడింగ్ లైట్స్, హీట్ వెంటిలేషన్ అండ్ ఏయిర్ కండిషనింగ్ సిస్టమ్ విత్ యు.వి.లాంప్, సేఫ్టీ ఫీచర్స్, కవాచ్ టెక్నాలజీ అడెడ్ ఫీచర్ సిస్టమ్ ఉంటుంది.

టికెట్ ధరలు..

కాజీపేట–నాగ్‌పూర్‌కు చైర్‌కార్ టికెట్ రూ.1280, ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్ రూ.2325, నాగ్‌పూర్–సికింద్రాబాద్ చైర్‌కార్ టికెట్ రూ.1350, ఎగ్జిక్యూటివ్ క్లాస్ రూ.2605 ఉంది.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

కాజీపేట: కాజీపేట రైల్వే ఆస్పత్రి దారిలో గంజాయిని విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని 860 గ్రాముల శుద్ధి చేసిన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. కాజీపేట పట్టణానికి చెందిన యువకుడు గొర్రె ప్రశాంత్ ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో విశాఖపట్నం వెళ్లి గంజాయి కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నాడు. ఎస్సై నవీన్‌కుమార్ పెట్రోలింగ్ చేస్తుండగా పారిపోతున్న ప్రశాంత్‌ను ఆపి తనిఖీ చేయగా గంజాయి లభించిందన్నారు. పంచుల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి వివరించారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మహిళ

చిన్నగూడూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఓ మహిళ ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మానుకోట జిల్లా చిన్నగూడూరు మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన గంగరబోయిన వెంకన్న, హైమ దంపతులు తెలిపిన వివరాల ప్రకారం .. అదే గ్రామానికి చెందిన గంగరబోయిన వీరన్న వద్ద వారు ఎకరం పొలం రూ.16లక్షలకు కొనుగోలు బేరం కుదుర్చుకున్నాడు. ముందుగా కొంత నగదును చెల్లించారు. మిగిలిన నగదును వాయిదాల ప్రకారం చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నారు. కొన్ని రోజుల తర్వాత వీరన్న మొత్తం నగదును చెల్లించాలని ఒత్తిడి చేయడంతో ఒప్పందం ప్రకారం చెల్లిస్తామని చెప్పినా వినకుండా మానసికంగా వేధించసాగాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినప్పటికీ తమకు న్యాయం జరగలేదని బాధితులు పేర్కొన్నారు. ఒక్కసారిగా అంత డబ్బు చెల్లించలేమని మనస్తాపానికి గురైన బాధిత మహిళ హైమ స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి దుర్మరణం



శ్రవణ్‌కుమార్ (ఫైల్)

హసన్‌పర్తి : బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదం ఆరెపల్లి–వంగపహాడ్ మార్గమధ్యలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన దామెర శ్రవణ్‌కుమార్ (23) ప్లంబింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం ఉదయం పనికి వెళ్లిన శ్రవణ్ రాత్రి వరకూ ఇంటికి రాలేదు. ఈక్రమంలో ఆదివారం పొలాల్లో బైక్‌తో ఓ యువకుడు పడి ఉన్నట్లు గుర్తించిన కానిస్టేబుల్ అక్కడికి వెళ్లి పరిశీలించగా అతడు మృతి చెంది ఉన్నాడు. ఆ యువకుడి వద్ద లభ్యమైన ఆధారాల మేరకు పెగడపల్లికివాసిగా గుర్తించారు. ఈమేరకు స్థానికంగా పంచమానా నిర్వహించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఎలిషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దాడిలో ఒకరి మృతి



భిక్షపతి (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి: మతిస్థిమితం లేని వ్యక్తి దాడిలో ఒకరు మృతి చెందిన ఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దామెరవాయి సమీపంలోని చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం .. దామెరవాయి గ్రామానికి చెందిన మోరే భిక్షపతి(48) ఆదివారం ఉదయం ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై కాటాపూర్ వస్తుండగా బెస్తగూడెం సమీపంలోని ఇటుకబట్టీల వద్ద మతిస్థిమితం లేని వ్యక్తి బైక్‌పై వెళ్తున్న భిక్షపతిని కర్రతో కొట్టడంతో కిందపడిపోయాడు. అంతటితో ఆగకుండా కర్రతో తలపై కొట్టడంతో రక్తస్రావం జరిగి స్పృహకోల్పోయాడు. తెలుసుకున్న గ్రామస్తులు భిక్షపతిని చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దాడికి కారకుడైన మతిస్థిమితం లేని వ్యక్తిని దామెరవాయి గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సదరు వ్యక్తి ఆరునెలల నుంచి ఇటుబట్టీల వద్ద తిరుగుతూ గ్రామంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటన స్థలాన్ని పస్రా సీఐ రవీందర్ పరిశీలించారు. పోలీసులు మతిస్థిమితం లేని వ్యక్తి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

పెట్టుబడుల ముసుగులో మోసం..

- రాజస్తాన్‌కు చెందిన సైబర్ నిందితుడి అరెస్ట్

వరంగల్ క్రైం: దేశ వ్యాప్తంగా పెట్టుబడుల ముసుగుల్లో ప్రజలను నమ్మించి కోట్లలో సొమ్ము కాజేస్తున్న రాజస్తాన్‌కు చెందిన సైబర్ నేరస్తుడిని వరంగల్ సైబర్ క్రైం పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ తెలిపారు. ఏసీపీ విజయ్‌కుమార్ కథనం ప్రకారం..రాజస్తాన్‌లోని దేగానా పట్టణానికి చెందిన కాలురామ్.. కొద్ది రోజులుగా ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ రూపంలో ఎక్కువ మొత్తంలో డబ్బు పొందొచ్చని ప్రజలను మోసం చేస్తూ కోట్లు కొల్లగొడుతున్నాడు. దేశ వ్యాప్తంగా పన్నెండుకు పైగా నేరాలకు పాల్పడ్డాడు. తెలంగాణ రాష్ట్రంలో రెండు నేరాలకు పాల్పడ్డాడు. హనుమకొండ ప్రాంతానికి చెందిన ఓ ప్రముఖ వైద్యుడిని నమ్మించి అతడి ద్వారా ఆన్‌లైన్‌లో రూ.21 లక్షల పెట్టుబడి పెట్టించి మోసం చేశాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్రత్యేక సైబర్ బృందం పోలీసులు ఈనెల 14న నిందితుడిని రాజస్తాన్‌లో అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు చరణ్, శివకుమార్, ఏఏఓ సల్మాన్ పాషా,కానిస్టేబుళ్లు కిశోర్ కుమార్, ఆంజనేయులు, రాజును సీపీ అభినందించారు.

నేడు ట్రైసిటీలో ట్రాఫిక్ ఆంక్షలు

- మధ్యాహ్నం 12 నుంచి మంగళవారం ఉదయం 10 గంటల వరకు..
- వినాయక నిమజ్జన నేపథ్యంలో నిర్ణయం
- సీపీ అంబర్ కిషోర్‌ఝా వెల్లడి



వరంగల్ క్రైం: వినాయక నిమజ్జనం నేపథ్యంలో వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రై సిటీ పరిధిలో సోమవారం ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీపీ అంబర్ కిషోర్‌ఝా పేర్కొన్నారు. నగరంలో శోభాయాత్రలు, నిమజ్జనానికి వినాయక విగ్రహాలను తరలించే మార్గాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు ఈనెల 16న మధ్యాహ్నం 12 నుంచి 17వ తేదీ ఉదయం 10 గంటల వరకు అమలులో ఉంటాయని వివరించారు.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

- ములుగు, భూపాలపల్లి వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే భారీ వాహనాలు ఆరెపల్లి ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి ప్రయాణించాలి. భూపాలపల్లి, పరకాల నుంచి ఖమ్మం వెళ్లాల్సిన వాహనాలు ఆరెపల్లి వద్ద ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి కరుణాపురం, మడికొండ, కడిపికొండ, నాయుడు పెట్రోల్ పంపు మీదుగా పోవాలి.
- భూపాలపల్లి, పరకాల నుంచి నర్సంపేట వైపు వెళ్లాల్సిన భారీ వాహనాలు కొత్తపేట, రెడ్డిపాలెం, జానీపీరీలు, గొర్రెకుంట నుంచి వెళ్లాలి.
- సిటీ లోపలికి వచ్చే భారీ వాహనాలు సిటీ అవతలే నిలిపివేయాలి. నిమజ్జన సమయంలో లోపలికి అనుమతి లేదు.

నగరంలోకి వచ్చి, వెళ్లే ఆర్టీసీ బస్సులకు..

- ములుగు, పరకాల వైపు నుంచి వచ్చే బస్సులు వయా పెద్దమ్మగడ్డ నుంచి కేయూసీ, సీపీఓ జంక్షన్ మీదుగా అంబేద్కర్ సెంటర్, ఏషియన్ శ్రీదేవిమాల్ నుంచి బస్టాండుకు చేరుకోవాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి బయలుదేరి ములుగు, కరీంనగర్ వైపు వెళ్లే బస్సులు వయా ఏషియన్ శ్రీదేవిమాల్, అంబేద్కర్ సెంటర్, సీపీఓ జంక్షన్ మీదుగా కేయూసీ జంక్షన్ నుంచి వెళ్లాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి నర్సంపేట, కొత్తగూడెం, భద్రాచలం, తొర్రూరు, ఖమ్మం వైపు వెళ్లే బస్సులు వయా బాలసముద్రం, అదాలత్, హంటర్‌రోడ్ మీదుగా వెళ్లాలి.
- వరంగల్ బస్టాండ్ నుంచి హనుమకొండ వైపు వచ్చే బస్సులు చింతల్ బ్రిడ్జి నుంచి రంగశాయిపేట్ మీదుగా నాయుడు పెట్రోల్ పంప్ సెంటర్, ఉర్సుగుట్ట, అదాలత్, బాలసముద్రం రోడ్ మీదుగా హనుమకొండకు చేరుకోవాలి.

నిమజ్జన వాహనాలకు..

- సిద్ధేశ్వర గుండంలో నిమజ్జనం చేయడానికి 6 అడుగుల ఎత్తు ఉన్న విగ్రహాలు.. ట్రాక్టర్, టాటా ఏస్ వాహనాల్లో వచ్చే వాటిని మాత్రమే అనుమతిస్తారు. శోభాయాత్ర హంటర్ రోడ్, అదాలత్, సీపీఓ జంక్షన్, హనుమకొండ చౌరస్తా, బాలాంజనేయ స్వామి టెంపుల్ మీదుగా వెళ్లి నిమజ్జనం అనంతరం వయా శాయంపేట మీదుగా తిరిగి రావాలి.
- హనుమకొండకు చెందిన భారీ వినాయక విగ్రహాలను చిన్న వడ్డేపల్లి చెరువులో నిమజ్జనం చేయాలి.
- ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, వడ్డేపల్లి ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలను బంధం చెరువులో నిమజ్జనం చేయాలి.
- చిన్నవడ్డేపల్లి చెరువులో నిమజ్జనం చేసే విగ్రహాలను కాశిబుగ్గ, పోచమ్మమైదాన్, దేశాయిపేట మీదుగా తీసుకెళ్లాలి. అనంతరం వయా ఏనుమాముల మార్కెట్ నుంచి కాశిబుగ్గ మీదుగా తిరిగి వెళ్లాల్సి ఉంటుంది.

బాధితురాలికి న్యాయం చేయాలి

- పీఎస్ ఎదుట గ్రామస్తుల ధర్నా
- ఘటనాస్థలికి చేరుకున్న డీఎస్పీ రవీందర్
- పోలీసు అధికారుల హామీతో ఆందోళన విరమణ




పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

వెంకటాపురం(ఎం): ఓ మహిళపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వెంకటాపురం(ఎం) పీఎస్ ఎదుట గంటకుపైగా ధర్నా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. పీఎస్ పరిధిలోని భూపాలపల్లి మండలం పెరకపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళపై ఈనెల 11వ తేదీన అదే గ్రామానికి చెందిన మాదం శివకుమార్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈఘటనపై 12వ తేదీన శివకుమార్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలితోపాటు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజులు దాటినా పోలీసులు పట్టించుకోకపోవడంతో ఆదివారం ఎస్పీ శబరీష్‌ను కలిసేందుకు వెళ్తున్న సుమారు 200 మంది గ్రామస్తులను పోలీసులు మండల కేంద్రంలోని తాళ్లపాడు వద్ద అడ్డగించారు. దీంతో ఆగ్రహం చెందిన గ్రామస్తులు పీఎస్ ఎదుట ధర్నా నిర్వహించారు. నిందితుడు గ్రామంలో తిరుగుతూ ఎవరైనా సాక్ష్యం చెబితే చంపేస్తానంటూ భయభ్రాంతులకు గురిచేస్తుంటే పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ ఆందోళన ఉధృతం చేశారు. ఎస్సై సతీశ్ మాట్లాడినా గ్రామస్తులు శాంతించలేదు. దీంతో ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్ ఘటనాస్థలికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. బాధితురాలు, కుటుంబసభ్యులు, పెద్ద మనుషులను పోలీస్‌స్టేషన్‌లోకి పిలిపించి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు. సుమారు గంటకు పైగా ధర్నా నిర్వహించడంతో రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబసభ్యులు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 11వతేదీన మహిళపై లైంగికదాడి జరిగితే జరిగితే పోలీసులు ఇప్పటివరకు న్యాయం చేయలేదన్నారు. డయల్ 100 నంబర్‌కు కాల్ చేస్తే ఎస్సై తమకు ఫోన్ చేసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. లైంగికదాడి జరిగినట్లు మీరు ఎలా చెబుతారని నిందితుడు ఏదైనా సేఫ్టీ వాడొచ్చు కాదా అని ఎస్సై దుర్భాలాషలాడని బాధితురాలి కుమారుడు విలేకరులకు వెల్లడించారు. న్యాయం కోసం ఎస్పీ దగ్గరకు వెళ్తుంటే ఎస్సై సతీశ్, సిబ్బంది అడ్డగించి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై ములుగు సీఐ శంకర్‌ను వివరణ కోరగా ఈనెల 12న కుటుంబీకులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశామన్నారు. వారు రోజుకు ఒక విధంగా ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. నిందితుడిని 48 గంటల్లోగా అరెస్ట్ చేస్తామని వెల్లడించారు.

బతుకుభారమై.. బలవన్మరణం

వేర్వేరు కారణాలతో బతుకుభారమై ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



వెంకన్న (ఫైల్)

నెక్కొండ: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని అలంకానిపేటలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పోరండ్ల వెంకన్న (53) తన పెద్ద కుమార్తె వివాహం చేశారు. ఇందుకు కొంత అప్పు చేశాడు. అలాగే, రెండో కుమార్తె వివాహం చేయాల్సి ఉండగా ఆర్థిక పరిస్థితులు బాగోలేవు. దీంతో కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో భార్య లక్ష్మి కూలీ పనులకు వెళ్లగా ఈ నెల 14వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లక్ష్మి ఇంటికి వచ్చి చూడగా వెంకన్న మృతి చెంది కనిపించాడు. ఈఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ ఆదివారం పేర్కొన్నారు.

ఇంటికన్నెలో రైల్వే ఉద్యోగి..

కేసముద్రం: గుండెజబ్బుతోపాటు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందుతున్న ఓ రైల్వే ఉద్యోగి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఇంటికన్నెలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి కడబోయిన విజయ్‌కుమార్(35) కొంతకాలంగా గుండెజబ్బు, ఆర్థిక ఇబ్బందుల కారణాలతో మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన విజయ్‌కుమార్.. ఈనెల 12న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య మణెమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మంగోరిగూడెంలో మహిళ..

చిన్నగూడూరు: అనారోగ్యంతో మహిళ ఉరేసుకుని మృతి చెందిన ఘటన మానుకోట జిల్లా చిన్నగూడూరు మండలంలోని మంగోరిగూడెంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ... మంగోరిగూడెం గ్రామానికి చెందిన డెంకన పద్మ(46) కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతుంది. జ్వరంతోపాటు ఒంటి నొప్పులు ఉండడంతో మనస్తాపానికి గురై ఆదివారం ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మనస్తాపంతో కాటారంలో వ్యక్తి..

కాటారం : భార్య మృతి చెందడంతోపాటు తాను జైలు పాలయ్యాననే మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాటారం మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం భూపాలపల్లి మండలం వేశాలపల్లికి చెందిన ఎలకంటి రమణాచారి(40) గతేడాది ఏప్రిల్‌లో కుటుంబ కలహాలతో తన భార్య రమను హత్య చేశాడు. హత్య కేసులో సుమారు పది నెలల పాటు జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై బయటకు వచ్చాడు. నాలుగు నెలల నుంచి కాటారం మండల కేంద్రంలోని మెగా కంపెనీకి చెందిన మెస్‌లో కుక్ హెల్పర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన భార్యను గుర్తు చేసుకుంటుండటంతో పాటు జైలుకు వెళ్లానని నిత్యం మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున మెస్ సమీపంలోని రేకులషెడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి అగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

మన్నెగూడెంలో అనుమానాస్పద స్థితిలో యువకుడు..

డోర్నకల్: సీరోలు మండలం మన్నెగూడేనికి చెందిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పి.వినేశ్(23)కు గత ఏప్రిల్‌లో కాంపెల్లి మండలం బర్లగూడేనికి చెందిన కరుణశ్రీతో వివాహం జరిగింది. ఈ నెల 11న భార్యను బర్లగూడెంలో వదిలివచ్చాడు. తండ్రి బాలునాయక్ (పాస్టర్) షుగర్ వ్యాధితో బాధపడుతుండగా ఆయనను శనివారం ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించాడు. వినేశ్ తిరిగి మన్నెగూడెం చేరుకున్నాడు. ఆదివారం చర్చి తాళాల కోసం స్థానికులు వినేశ్ ఇంటికి వెళ్లగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని తండ్రి బాలునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

■ WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్‌రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. కిరాయి రూ॥ 10 వేలు. సంప్ర॥ 9848696291. [W-1239986]

PLOTS FOR SALE

■ HNK, KITS College అంబాల రోడ్డు & ముచ్చర్ల రోడ్డు కొత్తగా వస్తున్న హైవే రోడ్డు దగ్గరలో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మబడును. సంప్ర॥ 9553255936. [W-1239961]

SERVICES

FINANCE

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికీ పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1239971]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు. సెల్: 9849145043 [W-1239959]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

WANTED

■ LAB TECHNICIANS - BOYS ✦ PHARMACY BOYS (మందుల షాపు) ✦OT BOYS కావలెను. సంప్ర॥ Guardian Hospital, Mulugu "X" Road, Warangal 12 to 2 pm. [WA-0429]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.